
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 3 ఆగస్టు 2025

కర్షకుడి మోమున దరహాసం



సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.. కష్టకాలంలో కర్షకుడికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది.. ఎరువులు, సేద్యం ఖర్చులకు తొలి విడతగా రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమ చేసింది. 'మా ఇంటా పెద్దకొడుకులా ఆదుకున్నారు.. చంద్రన్న నీవు చల్లంగా ఉండాలయ్యా..! అంటూ మట్టి మనుషులు మంచి మనసుతో ఆశీర్వాదిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పల్లెసీమల్లో రైతు ఇంట 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' రైతుల మోమున దరహాసం నింపింది. ఏ రైతును కదిపినా రెట్టింపు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది యువ రైతులతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

- 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకం ప్రారంభం
- రైతుల ఖాతాల్లో రూ.136.38 కోట్లు జమ
- సెల్‌ఫోన్లలో మెసేజ్ చూడగానే రైతన్నల సంతోషం
- మట్టిమనిషికి అండగా కూటమి ప్రభుత్వం

కర్నూలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కర్షకుడి మోమున దరహాసాన్ని నింపింది కూటమి ప్రభుత్వం. ఎరువులు, సేద్యం ఖర్చులకు అప్పులు చేయాల్సిన సమయంలో రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమ చేసి వారిని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించింది. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' అంటూ శనివారం జిల్లాలో 2,72,552 మంది రైతులకు రూ.136.38 కోట్లు జమ చేశారు. కలెక్టరు పి.రంజిత్‌బాషా ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో ఈ పథకం ప్రారంభించారు.



ఆలూరులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ నాగరాజు, వీరభద్రగౌడ్

మహోన్నత లక్ష్యంతో..

రైతులకు పంట పెట్టుబడి సహాయం అందించాలనే మహోన్నత లక్ష్యంతో కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు ఇస్తే, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు ఇస్తుంది. ఈ రెండు కలపి 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' ద్వారా రూ.20 వేలు రైతుల ఖాతాల్లో మూడు విడతల్లో జమ చేయనున్నారు. ఖరీఫ్‌లో తొలి విడత రూ.7 వేలు, రబీలో రెండో విడత రూ.7 వేలు, వేసవిలో మూడో విడత రూ.6 వేలు జమ చేస్తారు. శనివారం తొలి విడత రూ.7 వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

మొదటి రోజునే 95శాతం..

జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద 2,72,552 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఒక్కో రైతుకు రూ.7 వేలు ప్రకారం రూ.136.38 కోట్లు జమ చేశారు. మొదటి రోజునే 95 శాతం రైతుల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తుంది. ఎమ్మిగనూరు మండలం బనవాసి కేవీకేలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టరు ప్రారంభించారు. ఆ నియోజకవర్గంలో 38,318 మంది రైతులకు రూ.19.15 కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, ఆదోని సబ్ కలెక్టరు మౌర్య భరద్వాజ్, మార్కెట్ యార్డు చైర్మన్ కె.మల్లయ్య హాజరయ్యారు.

రైతుల్లో సంతోషాన్ని నింపింది

అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం పల్లెపల్లెన రైతుల్లో సంతోషాలు నింపింది. ఆలూరులో జరిగిన కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ 63,317 మంది రైతులకు 31.65 కోట్లు జమ చేసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేలాది మంది యువ రైతులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. గూడూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జాయింట్ కలెక్టరు బి.నవ్య కోడుమూరు నియోజకవర్గంలోని 35,082 మంది రైతులకు చెందిన రూ.17.52 కోట్లు భారీ చెక్కును రైతులకు అందజేశారు. పాణ్యం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత 32,978 మంది రైతులకు చెందిన రూ.22.39 కోట్ల చెక్కును రైతులకు అందజేశారు. పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆర్డీవో భరత్ నాయక్ చక్రాల గ్రామంలో జరిగిన సమావేశంలో 54,774 మంది రైతులకు రూ. 27.38 కోట్లు చెక్కును అందజేశారు. మంత్రాలయం ఓల్డ్ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, జనసేన ఇన్‌చార్జి బి.లక్ష్మన్న, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి నరవ రమాకాంతరెడ్డి 41,992 మంది రైతులకు రూ.20.99 కోట్ల చెక్కు అందజేశారు. ఆదోని మండలం నాగనాథనహల్లి గ్రామంలో ఏపీ కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి భూపాల్‌చౌదరి, బీజేపీ మండల కార్యదర్శి నాగరాజుగౌడ్, ఏడీఏ బాలవర్ధిరాజులు 18,722 మంది రైతులకు రూ.9.36 కోట్లు చెక్కు అందజేశారు.

అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : కలెక్టర్

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుందని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి ఆధ్వర్యంలో 'అన్నదాత సుఖీభవ' మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కేవీకేలో మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతగా 2,73,452 మంది రైతుల ఖాతాల్లోకి నిధులను జమ చేశారన్నారు. ప్రస్తుతం అన్ని రైతు సేవా కేంద్రాల్లో, పాక్స్‌లో యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయంలో రైతులు నూతన సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. పంటల సబ్సిడీ, బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాలకు ఈ క్రాప్ ఆధారంగా డేటా తీసుకుంటారన్నారు. రైతులంతా కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. జిల్లాలో 35 మంది రైతులకు డ్రోన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. డ్రోన్స్‌ను ఉపయోగించడంతో కొంతమందికి ఉపాధి అవకాశం కలగడంతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. అన్నదాత సుఖీభవ కింద లబ్ధికి సంబంధించిన మెగా చెక్కును కేవీకేలో రైతులకు అందజేశారు. రైతులకు ఉచితంగా ఆముదాల విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు రైతులతో ఏర్పాటుచేసిన సంభాషణను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ శేషఫణి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్, నందవరం సహకార సంఘం సొసైటీ చైర్మన్ ధర్మాపురం గోపాల్, కాశింవలి, కె.టి వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18ఏళ్లలోపు వయస్సు ఉన్న బాలల నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నటు ఐసీడీఎస్ పీడీ పి.విజయ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ, ధైర్య సాహసాలు, క్రీడలు, కళలు, సంస్కృతి, తదితర వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన దేశానికి చెందిన ఆసక్తిగల బాలలు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. Https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేంద్ర కమిటీ ద్వారా ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలి: డీఈవో



కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలని డీఈవో శామ్యూల్ పాల్ సూచించారు. నగర సమీపంలోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు, అకౌంటెంట్లతో డీఈవో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు విడుదలైన నిధులను సక్రమమైన రీతిలో వినియోగించుకుని బిల్లులను సత్వరమే అప్‌లోడు చేయాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల తరగతుల పర్యవేక్షణ, విద్యా కార్యకలాపాలు ఎస్‌ఎంసీ సభ్యులతో సంబంధాలు, అభ్యాసన ఫలితాలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగి ఉపాధ్యాయులను ప్రోత్సహించడం, ఉత్తమ పద్ధతులను కనుగొనడం, నెమ్మదిగా నేర్చుకునే వారికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలపై ప్రసంగించారు. సమావేశంలో జిల్లా సర్వశిక్ష అభియాన్ సెక్టోరల్ అధికారులు షేక్ రఫీ, ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్ సురేంద్రబాహూజీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్‌కు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

దేశ సంస్కృతికి పాటుపడిన వ్యక్తి బళ్లారి రాఘవ

డీఆర్వో వెంకటనారాయణమ్మ



బళ్లారి రాఘవకు నివాళి అర్పిస్తున్న డీఆర్వో, సిబ్బంది

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ దేశ సంస్కృతికి పాటుబడిన వ్యక్తి అని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) సి.వెంకటనారాయణమ్మ కొనియాడారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బళ్లారి రాఘవ జయంతిని టూరిజం, ఐసీడీఎస్ పీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి విశేషమైన కృషి చేసిన కళాకారుడిగా దేశ విదేశాల్లో పేరు గడించారని తెలియజేశారు. బళ్లారి రాఘవ న్యాయవాదిగా ఉన్న సమయంలో పేదలను ఆదుకునేవారని తెలిపారు. అనంతరం టూరిజం, ఐసీడీఎస్ పీడీ పీ.విజయ మాట్లాడుతూ బళ్లారి రాఘవ కర్నూలుకు చెందిన కృష్ణమ్మను వివాహం చేసుకున్నారని, బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. రావుబహదూర్ అన్న బిరుదు కూడా ఇచ్చి సత్కరించిందని తెలిపారు. సమావేశానికి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆర్గనైజర్ శారద తదితరులు పాల్గొన్నారు.

కాలువల కబ్జాపై జిల్లా యంత్రాంగం కన్నెర్ర



ఆదోని మండలం పెద్దహరివాణంలో ఎల్లెల్సీ డీపీ-65 కాలువపై ఆక్రమణలు తొలగిస్తున్న ఇంజనీర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- హెద్దహరివాణంలో ఎల్లెల్సీ డీపీ-65 కాలువపై ఆక్రమణలు తొలగింపు
- కాలువను పునరుద్ధరించిన ఇంజనీర్లు
- త్వరలో ఎమ్మిగనూరు ఎల్లెల్సీ డీపీ-79 గట్టు ఆక్రమణల తొలగింపు

కర్నూలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాలువలు, చెరువుల కబ్జాలపై జిల్లా యంత్రాంగం కన్నెర్ర చేసింది. హంద్రీ, ఎల్లెల్సీ, మైనర్ ఇరిగేషన్ చెరువులు ఆక్రమణలు గుర్తించి తొలగించాలని గత నెల 5న జాయింట్ కలెక్టర్ (జేసీ) బి.నవ్య జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. తాత్కాలిక నిర్మాణాలు, షెడ్లు తక్షణమే తొలగించి కాలువలు పునరుద్ధరించాలని చెప్పారు. తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) పశ్చిమ పల్లెసీలమ జీవనాడి. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో ఆదోని-సిరుగుప్ప ప్రధాన రహదారిలో డిమాండ్ ఉండడడంతో ఎల్లెల్సీ డీపీ-65 కాలువ (ఫీల్డ్ చానల్) గట్టును ఆక్రమించి 10-15 తాత్కాలిక షెడ్లు, శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో చెరువు స్థలం, ఫీల్డ్ చానల్ కబ్జాకు గురైంది. ఎమ్మిగనూరు పట్టణంలో ఎస్ఎస్ ట్యాంక్ నుంచి లక్ష్మణ్ థియేటర్, ఓంశాంతి కూడలి, వ్యవసాయ మార్కెట్ యార్డు మీదుగా ముగతి వరకు ప్రవహించే టీబీపీ ఎల్లెల్సీ డీపీ-79 కాలువ గట్టును రాజకీయ అండతో ఆక్రమించి తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ భాగోతాన్ని 'కాలువలు కబ్జా' అనే శీర్షికతో గత నెల 5న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి నోటీసులు జారీ చేశారు. కబ్జాలు తొలగించకపోవడంతో జేసీ బి.నవ్య ఆదేశాల మేరకు టీబీపీ ఎల్లెల్సీ ఈఈ, హంద్రీ-నీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ -1 ఎస్ఈ పాండురంగయ్య సూచనలతో ఎల్లెల్సీ డీఈఈ షఫీ, ఏఈఈ ఈశ్వర్, రెవెన్యూ అధికారులు పెద్దహరివాహణం గ్రామంలో ఎల్లెల్సీ డీపీ-65 కాలువ (ఫీల్డ్ చానల్) గట్టుపై అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్ల ద్వారా తొలగించారు. కాలువను పునరుద్ధరించారు. త్వరలోనే ఎమ్మిగనూరు పట్టణంలో ఎల్లెల్సీ డీపీ-79 కాలువ గట్టుపై ఆక్రమణలు తొలగిస్తామని ఎస్ఈ పాండురంగయ్య ఆంధ్రజ్యోతికి వివరించారు. కాలువలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిజర్వాయర్లను నింపడంలో విఫలం 7

- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- యాప్‌ల భారం తగ్గించాలి
- ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఫ్యాప్టో నాయకులు ఆరోపించారు. జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కో కన్వీనర్ ప్రకాష్‌రావు అధ్యక్షతన ఈ ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యాప్‌ల పేరుతో బోధనను పక్కకు పెట్టాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు తిమ్మన్న మాట్లాడుతూ తెలుగు మాధ్యమం కొనసాగిస్తామని ఎన్నికల ముందుహామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఫ్యాప్టో పోరాడుతోందని అన్నారు. ఏపీటీఎఫ్ 257 రాష్ట్ర నాయకుడు రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా బకాయిలు రాలేదన్నారు. ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ లీప్ యాప్ ఒకటి మాత్రమే అమలు చేస్తామని చెప్పి 70 యాప్‌లను పెట్టి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ మాట్లాడుతూ సరెండర్ లీవులకు సంబంధించి బకాయిలను చెల్లించాలన్నారు. ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పదోన్నతి, బదిలీ పొందిన ఉపాధ్యాయులకు గత రెండు నెలల జీతాలు అందలేదన్నారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలులోకి తేవాలని, వాటి ప్రకారమే మండల విద్యాశాఖ అధికార పోస్టులను భర్తీ చేయాలని, కోర్టు పేరు చెప్పి ఏ మాత్రం సీనియారిటీ లేనివారికి ఎంఈవో పోస్టులు కట్టబెట్టడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు చంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్, జనరల్ సెక్రటరీ భాస్కర్, యూటీఎఫ్ రవికుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

తుంగభద్ర తీరం

సాహిత్యం



పల్లెసీమల మట్టిని పరిమళింపజేసేవే 'హరికిషన్ కథలు'

కర్నూలు కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'ఎవరో వచ్చి మన చరిత్రను రాయరు. మన చరిత్రను మనమే రాయాలి. లేదంటే గాయపడ్డవారు రాయకపోతే వేటాడే వారు రాసిందే చరిత్ర అవుతుంది' అంటారు ప్రముఖ రచయిత, కర్నూలుకు చెందిన డాక్టర్ ఎం.హరికిషన్. అందుకే బాధితులే చరిత్ర లిఖించాలి అన్నట్లుగా మన భాష, సాంస్కృతిక వైవిధ్యం, ఆచార వ్యవహారాలు మనమే అక్షరబద్ధం చేయాలనే నిబద్ధత కలిగిన కథకుడు హరికిషన్. ఆయన కలం నుంచి జాలువారిన కథలే 'హరికిషన్ కథలు' పేరుతో కథా సంపుటి ఆయన వెలువరించారు. రాయలసీమ పల్లెల్లోని మట్టి పరిమళాన్ని పాఠకులకు చూపిస్తారు. జై తెలంగాణా ఉద్యమాన్ని న్యాయమైనదిగా చెబుతూనే, అత్యంత వివక్షతకు, నిరాదరణకు గురైన రాయలసీమ వాసులు సారించాల్సిన ముందుచూపుతో సామాజిక విశ్లేషకుడిగా ఈ కథలను చదివిన ప్రతి పాఠకులు అర్థం చేసుకుంటారు. పాత్రల పట్ల సానుభూతి, సహనభూతిని ప్రకటిస్తూనే చైతన్యాన్ని అందిస్తాడు రచయిత ఈ కథల్లో. అక్కడితో ఆయన ఆగిపోలేదు, పితృస్వామిక వ్యవస్థలో స్త్రీలను రాజకీయ పావులుగా వాడుకుంటూనే వారిని పేరుకు పదవుల్లో నిలబెడుతూ ఎటువంటి రాజకీయ అధికారాన్ని అందించక పోవడాన్ని 'పొద్దుపోని పంచాయితీ' కథలో రాజమ్మ పాత్రద్వారా చక్కగా వివరిస్తారు. అలాగే మెర్సీ కథ, జాస్మిన్ బసివిరాలు, బరితెగించింది, నిశ్శబ్ద ఆర్తనాదాలు, దేవుడా నా బిడ్డ సల్లంగుండాల వంటివి పితృస్వామిక వ్యవస్థలో స్త్రీల స్థితిగతులను తెలిపే కథలే కాదు వారిపట్ల సమాజంలో ఎందుకు చిన్నచూపు, చులకన భావం ఉందో, వివక్షత లేని సమాజాన్ని కోరుకున్న వ్యక్తిగా ఇందులోని పాత్రల ద్వారా చెప్పించారు. సాహిత్యమంటే మార్పును దృశ్యమానం చేయడమే అన్న భావనతో కథకుడిగా హరికిషన్ ముందున్నారని పాఠకులు అభిప్రాయపడతారు. ఈ పుస్తకానికి ముందుమాట ప్రొఫెసర్ శ్రీదేవి రాయగా, ఈ పుస్తకాన్ని డాక్టర్ హరికిషన్ తన సతీమణి డాక్టర్ చంద్రమౌళిని, కుమార్తె లాస్య, కుమారుడు సుహాస్‌లకు అంకితం ఇచ్చారు. దీప్తి ప్రచురణలు ఈ పుస్తకాన్ని పబ్లిష్ చేశారు. ఇది అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాల్లో లభిస్తుంది.



- ఎన్. నాగమణి, ఉపాధ్యాయురాలు, ఎమ్మిగనూరు.

ఉషా పోటీల్లో కేవీఆర్ విద్యార్థినులకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 1న జరిగిన జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉషా పోటీల్లో కేవీఆర్ కళాశాల విద్యార్థినులు 26 పతకాలు సాధించారు. శనివారం కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరెడ్డి మాట్లాడారు. మహిళలు చదువుతో పాటు ఉషా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తీసుకుంటే ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు పావని, ఇన్‌చార్జి పీడీ ఆర్తి చక్ర, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సు

కర్నూలు అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయ్‌కుమార్ నాయుడు తెలిపారు. ఇంటర్‌లో ఏగ్రూప్ అయినా (సీఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, హెచ్‌ఈసీ, బైపీసీ)తదితర గ్రూప్‌ల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరిన అర్హులైన విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సదుపాయాలు వర్తిస్తాయని, క్యాంపస్‌లో ప్రత్యేక హాస్టల్ వసతి కూడా ఉందని తెలిపారు. దరఖాస్తుతో పాటు కోర్సుకు సంబంధించిన ఫీజులు, ఇతర వివరాల కోసం వాణిజ్య శాఖ కోఆర్డినేటర్ డాక్టర్ మోజస్‌ను(8019959859)కు సంప్రదించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కళ

ఆయన నటన.. సార్వజనికం

- విలక్షణ నటుడిగా ప్రత్యేక గుర్తింపు
- సాంఘిక, పౌరాణిక నాటకాల్లో రాణింపు
- సామాజిక, ధార్మిక రంగాల్లోనూ సేవలు కొనసాగిస్తున్న క్రిష్టఫర్



ధృతరాష్ట్రుని పాత్రలో క్రిష్టఫర్

'కళ సమాజ హితానికి ఉపయోగపడాలి. కళాకారులు సామాజిక చైతన్యానికి దివిటీలా నిలవాలి. అప్పుడే ఆ కళకు, ఆ కళాకారుడికి సార్థకత ఏర్పడుతుంది' అంటారు ఆయన. అందుకే ఆయన నటనను సార్వజనీకంగా భావించి ముందుకు పోయారు. తన కళాజీవితంలోనే షష్టిపూర్తి పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం 82 ఏళ్ల ప్రాయంలోనూ సాంఘిక, పౌరాణిక, ఆధ్యాత్మిక నాటకాల్లో రాణిస్తున్నారు. సామాజిక, ధార్మిక రంగాల్లోనూ తనదైన సేవలు కొనసాగిస్తున్నారు. ఆయనే కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు, కందుకూరి పురస్కార గ్రహీత నలుగోట్ల దేవవర క్రిష్టఫర్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసినా, ప్రవృత్తి రీత్యా నాటక రంగ కళాకారుడిగా తనదైన సేవలు కళామతల్లికి అందిస్తున్నారు. కందనవోలు నాటక రంగ కీర్తిప్రతిష్టలను నేల నాలుగు చెరగులా చాటి చెబుతున్నారు.

● కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

కర్నూలు నగరానికి సమీపంలోని గార్గేయపురం గ్రామానికి చెందిన నలుగోట్ల అబ్రహాం, రత్నమ్మ దంపతులకు ఐదుగురి సంతానంలో ఒకరిగా 1943 అక్టోబరు 19న ఎన్.డి. క్రిష్టఫర్ జన్మించారు. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో అక్షరాలు నేర్పించే తొలి గురువు ఆయనే అయ్యారు. కోల్స్ హైస్కూల్‌లో చేరి అక్కడ ఎస్ఎస్ఎల్‌సీ 1961-62 విద్యాసంవత్సరంలో పూర్తి చేశారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలో సెకండరీ గ్రేడింగ్ ట్రైనింగ్ 1993-65లో పూర్తి చేశారు. 1965 జూలై 9న ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగం లభించింది. కోసిగి, నందికొట్కూరు తదితర మండలాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. విద్యాశాఖలోని డిపెఫ్ కార్యాలయంలో పనిచేస్తూ పదవీ విరమణ చేశారు.

అవార్డులు, రివార్డులు ఎన్నో...

ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం సేవలు అందించిన ఎన్.డి.క్రిష్టఫర్‌కు కోసిగి, నందికొట్కూరు ప్రాంతాల్లో ఆగస్టు 15, జనవరి 26 జాతీయ దినోత్సవాల్లో గ్రామ, మండల స్థాయి పురస్కారాలు అందజేశారు. అలాగే సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు ఆయనను ఘనంగా సత్కరించాయి. 1996లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా స్థాయి అవార్డు లభించింది. కళాకారునిగానూ ఆయన అందించిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయి కందుకూరి పురస్కారం ప్రదానం చేసింది. డిపెఫ్‌లో అక్షరాస్యతా కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేసిన ఆయన విద్యాశాఖ పక్షాన 1990లో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

లఘు చిత్రాలు, టీవీ కార్యక్రమాల్లో...



1990లో నాటి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమంలో ఎన్.డి. క్రిష్టఫర్ చురుకుగా పాల్గొన్నారు. వివిధ లఘు చిత్రాల ద్వారా అక్షరాస్యతపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. 1993లో పొదుపు లక్ష్మి కార్యక్రమాల్లోనూ టీవీ కార్యక్రమాల ద్వారా ప్రసారం కల్పించారు. ఒక టీవీ ఛానల్‌లో నిర్విరామంగా వచ్చిన నేరాలు-ఘోరాలు అనేక ఎపిసోడ్లలో కర్నూలు జిల్లా నుంచి వివిధ పాత్రల్లో ఆయన నటించారు.

మలుపు తిప్పిన నాటక రంగ జీవితం



పులిస్వారీ నాటకంలో.. (తెల్ల పంచె, కండువా వ్యక్తి)

1965లో ఉద్యోగంలో చేరాక నాటకాలపై క్రిష్టఫర్ ఆసక్తి పెంచుకున్నారు. అప్పటికే హైస్కూల్ విద్య అభ్యసిస్తున్న కాలంలో కోల్స్ హైస్కూల్‌లో టీవీ డేవిడ్ అనే ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో కోల్స్ చర్చి తరపున 'మంచి సమరయుడు' అనే నాటకం ప్రదర్శించారు. అలా నాటక రంగంపై ఆసక్తి ఉన్నా, చదువు, భవిషత్తును దృష్టిలో పెట్టుకొని అప్పుడప్పుడు నాటకాలు ప్రదర్శిస్తూ కెరీర్‌పైనే దృష్టి పెట్టారు. ఉపాధ్యాయ ఉద్యోగం లభించాక 1966లో కరుణమ్మతో వివాహం అయింది. ఆమె కూడా ఉపాధ్యాయురాలే కావడంతో ఆమె ప్రోత్సాహంతోనూ నాటకాల్లో తిరిగి అభినివేశం చేశారు. అలా కోసిగిలో పనిచేస్తున్న కాలంలో హార్మోనిస్టు ఓంకారస్వామి సహకారంతో 'ధర్మద్రోహి' అనే నాటకానికి దర్శకత్వం వహించి ప్రదర్శించారు. ఈ నాటకం ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. 1980లో 'శ్రీకృష్ణ రాయబారం' నాటకంలో కర్ణుడిగా పాత్ర పోషించారు. 1990లో సత్యహరిశ్చంద్ర నాటకంలో సత్య హరిశ్చంద్రుని పాత్ర పోషించారు. 1998లో కర్నూలులోని లలిత కళా సమితి (ప్రస్తుత టీజీవీ కళాక్షేత్రం) సంస్థతో పరిచయం అయ్యాక దర్శకుడు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో 'పులిస్వారీ' నాటకంలో ప్రధాన ప్రతినాయకుడి పాత్ర పోషించారు. ఈ నాటకం ప్రదర్శించిన ప్రతిచోటా ప్రశంసాలు అందుకుంది. రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో రూపొందించిన ఈ నాటకం 150 ప్రదర్శనలను దాటిపోయింది. శ్రీకృష్ణ రాయభారంలో ధృతరాష్టుని పాత్ర, సైరా నరసింహారెడ్డి నాటకంలో ముఖ్య పాత్ర పోషించారు. సాంఘిక నాటకాల్లోనూ బావా ఎప్పుడు వచ్చితీవు, ఓటున్న ప్రజలకు కోటి దండాలు వంటివి ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.

నట నిఘంటువు.. బళ్లారి రాఘవ



నివాళి అర్పిస్తున్న కళాకారులు

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక నటులకు దివంగత రంగస్థల నటుడు బళ్లారి రాఘవ గొప్ప నట నిఘంటువులాంటి వారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. శనివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో విశ్వ విఖ్యాత రంగస్థల నటుడు, దివంగత బళ్లారి రాఘవ జయంతిని ఘనంగా నిర్వహించారు. బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాటక రంగానికి ఆయన చేసిన సేవలను కళాకారులు కొనియాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఓబులయ్య మాట్లాడుతూ అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించిన బళ్లారి రాఘవ కర్నూలుకు అల్లుడు కావడం కూడా ఒక విశేషమని చెప్పారు. తెలుగు, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో మేటి నటుడిగా ఖ్యాతి గాంచిన బళ్లారి రాఘవ 150 ఏళ్ల క్రితమే కోలాచలం శ్రీనివాసరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులతో కలిసి తెలుగు నాటక రంగానికి విశేష ప్రచారం కల్పించారని గుర్తు చేశారు. పలువురు కళాకారులు మాట్లాడుతూ బళ్లారి రాఘవ జయంతిని అధికారికంగా ప్రకటించిన జిల్లా అధికారులు మొక్కుబడిగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరుకుండిపోయారని, కళాకారులను ఎవరినీ ఆహ్వానించకపోవడం బాధాకరమని తెలిపారు. వ్యాఖ్యాత ఇనాయతుల్లా మాట్లాడుతూ కర్నూలు ప్రశస్తిని విదేశాల్లో చాటిచెప్పిన మహనీయుడు బళ్లారి రాఘవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటులు పి.దస్తగిరి, భాస్కర్, అజీజ్, రాజారత్నం, కేవీ రమణ, శ్రీనివాసరెడ్డి, సీవీ రెడ్డి, గాండ్ల లక్ష్మన్న, శామ్యూల్, పీపీ గురుమూర్తి, మోహన్, యాగంటీశ్వరప్ప, కె.బాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని రాఘవ జీవిత విశేషాలను తెలియజేశారు.



స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం.. ఏస్వార్థం లేకుండా సహజంగా ఏర్పడేది స్నేహబంధం. అంతరాలు, అంతస్తులు ప్రమేయం లేకుండా ఆప్యాయతల కలబోతతో కలిసి నడవగలిగే సయోధ్య స్నేహితుల సొంతం. నాకేంటి.. నాఫ్రెండ్ ఉన్నాడు.. అనే భరోసా.. ఆపద సమయంలో ఎంతో ఊరటనిస్తుంది. వాస్తవానికి మనిషికి ఆపదలు రావడం ఒక్కోసారి మంచిదనే భావించారు. ఆ తరుణంలో తనకు అండగా ఉండి ఆదుకునే వారెవరో స్పష్టమవుతోంది. స్వచ్ఛమైన స్నేహం సంకుచితత్వానికి దూరంగా, ఆత్మీయతకు దగ్గరగా నిలుపుతుంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాంగ్రెస్ 1935 ఆగస్టులో వచ్చే మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించగా క్రమక్రమంగా స్నేహితుల రోజు ప్రపంచ దేశాలకు వ్యాపించి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవంగా మారింది. ప్రతి ఏటా ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

- స్నేహానికి సమాజంలో సముచిత స్థానం
- ఆపదలో భరోసానిచ్చేది స్నేహబంధం
- సృష్టిలో తీయనైనది స్నేహమే
- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

రక్తదానం చేశా



రక్తదానం మహాదానం. దేవుడు ప్రాణం పోస్తే స్నేహితుడు ప్రాణం ఇస్తాడు. మిత్రబృందం సభ్యుల ఆధ్వర్యంలో రక్తదానం చేయడంతో ఎంతో తృప్తిగా ఉంది. ఇప్పటి వరకు పదిసార్లు రక్తదానం చేశా. ఆపదలో రక్తం ప్రాణాన్ని కాపాడుతుంది.

● కొమ్మలపాటి రాజారావు, టీడీపీ పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి



ఆత్మకూరు/ రుద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జీవితంలో మనం ఏర్పర్చుకునే బంధాలన్నీ అవసరార్థమైనప్పటికీ స్నేహబంధం మాత్రం వాటికి అతీతమైంది. సృష్టి ఉన్నంత కాలం నిలిచేది ఒక్క స్నేహమే. ఆది దేవుళ్ల సృష్టి, స్థితి, లయకారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు స్నేహబంధంతోనే సమస్తలోకాలను శాసించారు. జగన్మాతలు సైతం స్నేహంగా ఉండబట్టే రాక్షస సంహారం గావించబడి లోకాలన్నీ శాంతించాయి. ఇలా పురాణాల కాలం నుంచే స్నేహానికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. అప్పట్లోనే కాదు.. ఇప్పట్లో కూడా స్నేహానికి సమాజంలో సముచిత స్థానం వుంది. సృష్టిలో తీయనైంది స్నేహమేనని ఎందరో కవులు పేర్కొన్నారు.

ఆగస్టు మొదటి ఆదివారం

అమెరికా ప్రభుత్వం 1935 ఆగస్టు మొదటి శనివారం ఓ వ్యక్తికి మరణశిక్ష విధించింది. అతని మరణవార్త విని ఆ మరుసటిరోజే అతని స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటనకు సంబంధించిన అమెరికా ప్రభుత్వం వీరి స్నేహానికి గుర్తుగా అప్పటినుంచి ఆగస్టు మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. మనదేశంలో కూడా ఆగస్టు మొదటి ఆదివారాన్నే స్నేహితుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. స్నేహితులు తమ స్నేహానికి గుర్తుండిపోయేలా సంబరాలు చేసుకుంటారు. ప్రత్యేకించి ప్రస్తుత ట్రెండ్‌లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ చేతికి కట్టి శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు.

రుద్రవరం ఉన్నత పాఠశాలలో..

రుద్రవరం ఉన్నత పాఠశాలలో 1993-94లో పదోతరగతి విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న మిత్రబృందం సభ్యులు సేవాగుణంతో ముందుకు సాగుతున్నారు. మిత్రుల కుటుంబాలను, పేద విద్యార్థులు, నిరుపేదలకు ఆర్థికసాయం అందిస్తూ దాతృత్వ గుణం చాటారు. తమ వంతు ఆర్థికసాయం, నిత్యావసర వస్తువులు, బ్రెడ్‌షీట్లు, నగదు సాయం ఇలా సాయం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. 2024 ఆగస్టు 4న స్నేహితుల దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసి 40మంది స్నేహితులు రక్తదానం చేశారు. ఈరక్తదానం ప్యాకెట్లను రక్తనిధి కేంద్రం నంద్యాలకు అప్పగించారు.



రుద్రవరంలో మిత్రుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న మిత్రబృందం సభ్యులు (ఫైల్)

సమాజ సేవలో తృప్తి



మనిషి జీవితంలో సమాజ సేవలో ఉన్న తృప్తి ఇంకోటి ఉండదు. మిత్రుల కుటుంబాలను ఆదుకోవడం దైవమిచ్చిన వరం. తోటిమనిషికి సహాయ సహకారాలు అందించడంలో ఆనందం మరోకటి ఉండదు.

● కట్టుబడి బాషా, కొండమాయపల్లె

అన్ని దానాల్లో రక్తదానం మిన్న



అన్నిదానాల్లో రక్తదానం గొప్పది. అత్యవసర సమయాల్లో మనిషి ప్రాణాన్ని రక్తం ఇచ్చి కాపాడవచ్చు. యువతీ యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలి.

● మల్లికార్జున, ఆర్ఎంపీ వైద్యుడు, రుద్రవరం

మిత్రులను ఆదుకోవడం..



మిత్రులను ఆదుకోవడం తోటి మిత్రుడిగా ఉన్న తృప్తి మరోదానిలో ఉండదు. మిత్రుడు కష్టాల్లో ఉన్నప్పుడు చేయూతనందించడంలో ఉన్న సంతోషం మరొకటి ఉండదు, ఒకరికొకరు సహాయసహకారాలు చేసుకోవడమే స్నేహం.

● ఎ.శ్రీనివాసరెడ్డి, రుద్రవరం



నేర నివారణకు విజిబుల్ పోలీసింగ్

- ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు
- రోడ్డు భద్రత నియమాలను పాటించాలి : ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలలో భద్రతా భావం పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత నెలలో డ్రంకెన్ డ్రైవ్‌లో 928 కేసులు నమోదు కాగా, ఒక్కొక్కరిపై రూ.3వేల నుంచి 10వేల వరకు కోర్టు జరిమానాలు విధించిందన్నారు. ఓపెన్ డ్రింకింగ్ కేసులు 1790 నమోదు చేయగా.. ఒక్కొక్కరిపై రూ.1000లు జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు.

ఆటో శుభ్రం చేస్తూ..


హుస్సేన్

- కుందూనదిలో యువకుడు గల్లంతు
- ముమ్మరంగా గాలింపు చర్యలు

బండిఆత్మకూరు, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): ఆటో శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి ఓ యువకుడు గల్లంతు అయ్యాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాలు.. బండిఆత్మకూరుకు చెందిన ముర్తుజా వలి హుస్సేన్(22) శుక్రవారం సాయంత్రం కుందూనదిలో ఆటో శుభ్రం చేస్తున్నాడు. తన చెప్పు ఒకటి నీటిలో పోతుండగా దానిని తీసుకునేందుకు కొంత నదిలోకి ముందుకు వెళ్లగా నీటిప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాడు. అదేరోజు రాత్రి అతడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేశా మని, శనివారం ఉదయం కోవెలకుంట్ల నుంచి నది వెంట పోలీసులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు.ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో బండిఆత్మకూరు వంతెన వద్దనే నీటి ప్రవాహంలో మృతదేహం నదిలో కొట్టుకుని పోతుండగా స్థానికులు చూసి ఆ శవం గల్లంతైన యువకుడిదేనని గుర్తించి బంధువులకు, ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. నది వెంట ఉన్న బండి ఆత్మకూరు, కాకనూరు వంతెనల వద్ద మృతదేహాన్ని కర్రలతో బయటకు తీసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. నంద్యాల మండలం భీమవరం వంతెన వద్ద మృతదేహం వెలికితీత కోసం సిబ్బంది, స్థానికులతో వేచి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. గల్లంతైన ముర్తుజావలి ఇంట్లో తీవ్ర ఆందోళన అలుముకుంది.

కార్మికుడి మృతి

కొలిమిగుండ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల పరిధిలో ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో పనిచేసే ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన దోలపద్ర దాల్చిని(48) రామ్‌కో సిమెంట్ పరిశ్రమలోని ఓ కాంట్రాక్టు కంపెనీ కింద కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధుల్లో ఉండగా కిందపడి తలకు బలమైన గాయాలు కావడంతో అతడి గదికి తీసుకెళ్లి తోటి కార్మికులు సమసర్యలు చేసినట్లు పలువురు కార్మికులు చెబుతున్నారు. అనంతరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంతో మృతి చెందినట్లు వారు పేర్కొంటున్నారు. అయితే దాల్చిని తన గదిలోనే కిందపడి మృతి చెందినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కోంటున్నాయి. సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పోలీసులు తోటి కార్మికులను అదుపులోకి తీసుకొని వాచారణ చేపడుతున్నారు. మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ స్తంభం పడి వ్యక్తి..

గడివేముల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని సోమాపురం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రం ఛాత్రజిల్లాలోని బిల్‌గడ గ్రామానికి చెందిన విజయ్ (30) సోమవారం గ్రామం వద్ద 11 కేవీ విస్తరణ పనులు చేసేందుకు వచ్చాడు. స్తంభాన్ని పాతి సపోర్టుగా మరో స్తంభాన్ని పాతుతుండగా స్తంభం అతడి మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని రాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

అవుకు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన నొస్సం రాజేష్ (20) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందాడు. వివరాలు రాజేష్ సోలార్ ప్లాంట్‌లో కూలీ పని కోసం నడుచుకుంటూ గ్రామ సమీపంలోని పెద్దమ్మ కనుమ వద్దకు చేరుకున్నాడు. కొండమనాయునిపల్లె నుంచి వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తున్న రాజేష్‌పైకి దూసుకెళ్లింది. స్పృహ తప్పి పడిపోయిన రాజేష్‌ను స్థానికులు అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకం కింద అటెండ రుగా ఉద్యోగ నియామక పత్రాలు శనివారం జడ్పీ చైర్మన్ అందజేశారు. జిల్లా పరిషత్ పరిధిలో చనిపోయిన ఉద్యోగురు కుటుంబాల్లో ఒకరికి నాలుగో తరగతి ఉద్యోగులుగా నియామకపత్రాలను జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ చాంబరులో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అందజేశారు. డి.నీరజాబాయిని (జడ్పీహెచ్‌ఎస్ నొస్సం, సంజామల మండలం), పి.శేఖర్ (ఎంపీపీ, ఓర్వకల్లు), ఎన్.రమాదేవి (పీఐఆర్ (పీఐయూ)) నంద్యాల డివిజన్, ఎస్.విజయకుమారి స్వీపర్ (జడ్పీహెచ్‌ఎస్, గార్గేయాపురం)లలో కేటాయిస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

రిజర్వాయర్లను నింపడంలో విఫలం

- పోతిరెడ్డిపాడు నీటిని ఎందుకు వినియోగించుకోవడం లేదు?
- యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలి
- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, పక్కనే ఎమ్మెల్సీ మధుసూదన్

కర్నూలు, న్యూసిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వస్తున్న వరద నీటితో రిజర్వాయర్లు, చెరువులను నింపడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారులు చొరవ తీసుకుని అన్ని రిజర్వాయర్లను నింపుకు నేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీశైలం, సాగర్, కృష్ణా బ్యారేజీల్లో నీటిమట్టం పూర్తిస్థాయిగా ఉన్నప్పుడు రిజర్వాయర్లు, చెరువులను ఎందుకు పూర్తిస్థాయిలో నింపుకోలేదని అధికారులను ప్రశ్నించారు. అయిన కూడా జిల్లాలోని చెరువులను నింపలేకపోవడం దారుణమన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి వచ్చే నీటిని ఎందుకు సద్వినియోగం చేసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. కేసీ కెనాల్ కింద పంటలకు నీరిందించడంలో కూడా అధికారులు వైఫల్యం చెందారన్నారు. ఉమ్మడి జిల్లాలో రిజర్వాయర్లు తక్కువగా ఉన్నాయని, ఉన్న వాటిని కూడ నింపుకోలేకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుంద న్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో నీరు అందించాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉందని ఇటీవల వివిధ పత్రికల్లో కథనాలు వచ్చిన అధికారులు ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. గత సర్వసభ్య సమావేశంలోనే సభ్యులు ఎరువుల కొరతపై ప్రస్తావించినా కూడా ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీలు, సుంకన్న, రంగనాథ గౌడు, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

పశ్చిమ ప్రాంతంలో పండ్లతోటల పెంపకంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. అవగాహనకు ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించాలి. గతంలో అనంతపురం జిల్లా పూర్తిగా నీరు లేకుండా ఉండేది. అయితే ప్రస్తుతం అక్కడ పండ్లతోటల పెంపకం పూర్తిగా అభివృద్ధి ఎలా సాధ్యమైందో అధికారులు చూసుకోవాలి. జిల్లాలో నీటివనరులు ఉన్న కూడా పండ్లతోటల పెంపకంపై ఇంకా పూర్తిస్థాయిలో అవగాహనకు రాలేకపోతున్నారు.

- మధుసూదన్, ఎమ్మెల్సీ

ప్రశ్నించేవారే కరువు.. జిల్లాలోని వివిధ మండలాల్లో నెలకొన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన జడ్పీటీసీలు కరువయ్యారు. ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరగ్గా అందులో కోరం లేకుండానే సమావేశాలను మమ అనిపించారు. ప్రతి సమావే శానికి చైర్మన్, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక్క ఎమ్మెల్సీ, ఆరు మంది జడ్పీటీసీలు హాజరుకావాలి. అయితే శనివారం జరిగిన సమావేశాల్లో పూర్తిస్థాయి జడ్పీటీసీలు హాజరు కాలేదు. దీంతో వచ్చినవారు కూడా ఏదో వచ్చామా.. ఏదో అడిగామా అన్నట్లుగా వచ్చి వెళ్లారు.

జడ్పీటీసీలు ఏమన్నారంటే..

- కూటమి ప్రభుత్వం 50ఏళ్లకు ఇస్తామని చెప్పిన పింఛన్ ఎప్పుడు ఇస్తారని, వర్షాకాలంలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, మండలంలో గోకులం షెడ్లు మంజూరు చేసి ఎక్కడ కనబడటం లేదని వెల్దుర్తి జడ్పీటీసీ సుంకన్న అన్నారు.
- జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో బుక్‌కీపర్ శిరీషను పూర్తిగా ఇబ్బందులు పెడుతున్నారని, ఉద్యోగం నుంచి తొలగిస్తే ఆమె ఆత్మహత్య చేసుకుంటుందని జడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి అన్నారు.
- గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టి గృహనిర్మాణాలను ప్రభుత్వం కంటిన్యూ చేయాలని, పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, మండలానికి ఎరువులు వస్తున్నాయి..అయితే అవి రైతులకు అందకుండ ఎక్కడికి వెళ్తున్నాయో అర్థం కావడం లేదని కొత్తపల్లి జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు.
- బ్రాహ్మణకొట్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు దగ్గరగా ఉన్న వైన్‌షాపును తొలగించాలని ప్రతి సమావేశంలో చెబుతున్న పట్టించుకోవడం లేదని నందికొట్కూరు జడ్పీటీసీ అన్నారు.



మాట్లాడుతున్న తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్

తైక్వాండో క్రీడాభివృద్ధికి కృషి

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తైక్వాండో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ అన్నారు. పట్టణంలోని బీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో శనివారం సబ్ జూనియర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లాకు పతకాలు తీసుకువాలని కోరారు. జిల్లాలోని నలుమూలలనుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లను ఎంపిక చేశామని చెప్పారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 9, 10తేదీల్లో మంగళగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వనాథ్, భాస్కర్‌రెడ్డి, షేక్షావలి, రత్నకుమార్, మహబూబ్‌బాషా, జూడో శిక్షకులు శాంతరాజు, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత


బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

బేతంచెర్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు బనగానపల్లె రహదారిలో ఉన్న కేజీబీవీలో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కేజీబీవీలో నాలుగు రోజుల క్రితమే ఒక విద్యార్థిని మృతి చెందిన ఘటన మరువకముందే మళ్లీ శనివారం సాయంత్రం అదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని విజయలక్ష్మి, 7వ తరగతి విద్యార్థిని నాగభవానీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని బేతంచెర్ల ప్రభుత్వాసుపత్రిలో సీపీఐ, విద్యార్థి సంఘాల నాయకులు పరామర్శించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. ఎంఈవో సోమశేఖర్‌ను వివరణ కోరగా.. ఈవిషయంపై వివరాలు తెలుసుకుంటానన్నారు.

సన్నబియ్యం అని రేషన్ బియ్యం ఇచ్చాడు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు


బాధితులకు ఇచ్చిన బియ్యం

నంద్యాల టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆటోలో ఓ వ్యక్తి సన్నబియ్యం (కర్నూలు సోనా రకం) అని చెప్పి బియ్యం చూపించి రేషన్ బియ్యాన్ని అంటగట్టి ప్రజలను మోసం చేశాడు. ఈ ఘటన పట్టణంలో దేవనగర్‌లో చోటుచేసుకున్నట్లు బాధితుడు వసంతకుమార్ తెలిపారు. వివరాలు.. దేవనగర్, గోపాల్ నగర్, సలీంనగర్ ప్రాంతాల్లో ఓ వ్యక్తి ఆటోలో బియ్యాన్ని తీసుకువచ్చాడు. ప్రజలు సోనా బియ్యం అని సుమారు 30 ప్యాకెట్ల వరకు కొన్నారు. తీరా అవి తెరిచి చూస్తే ఆ ప్యాకెట్లలో మగ్గిపోయిన రేషన్ బియ్యం ఉన్నాయి. ఫోన్‌పేలో ఆ వ్యాపారి పేరు శివ అని వచ్చింది. ఫోన్ చేస్తే రింగ్ అవతుందని బాధితులు తెలిపారు. కొన్న సమయంలో వివరాలు అడగగా అవుకు అని చెప్పారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు ఏమి చేయాలో తెలియక అందరు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

కల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 76.07లక్షల మంది రైతులుంటే కూటమి ప్రభుత్వం 47లక్షల మందికే 'అన్నదాత సుఖీభవ' వర్తింపచేసి 30లక్షల మంది రైతులకు అందకుండా చేశారని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. శనివారం నగరంలో దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీలు అందరికీ కాకుండా కొందరికే అమలుచేస్తున్నారని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ సగం మందికే ఇస్తూ, 'తల్లికి వందనం' కింద దాదాపు 20 లక్షల మంది బిడ్డలకు కోతపెట్టారన్నారు. ఎన్నికల ముందు రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రూ.14వేలు జోడించి అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు రైతుల సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జనార్దన్, బాలస్వామి, రమణ, పఠాన్ అభిఖాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ X వైసీపీ కార్పొరేటర్ల..

మాటల యుద్ధం

- రసాభాసగా నగరపాలక సమావేశం
- వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు పందికొక్కులా తినేశారు
- కార్పొరేటర్ క్రాంతికుమార్
- వైసీపీ కార్పొరేటర్ల ఆందోళన


సమావేశంలో కార్పొరేటర్ల వాగ్వాదం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు పందికొక్కులా తిన్నారంటూ 12వ వార్డు కార్పొరేటర్ క్రాంతికుమార్ ధ్వజమెత్తారు. ఇంతలో వైసీపీ కార్పొరేటర్లు లేచి ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సభామర్యాద కాదని తక్షణమే ఆమాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం మొదలైంది. శనివారం జరిగిన కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం అసెంబ్లీని తలపించింది. క్రాంతికుమార్‌ను వైసీపీ కార్పొరేటర్లు చుట్టుముట్టి పోడియం ముందు బైఠాయించారు. అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. గత సమావేశంలో కుర్చీ ఎత్తిపారేసిన వైసీపీ కార్పొరేటర్ యూనుస్‌బాషను ఎందుకు సస్పెండ్ చేయలేదని క్రాంతికుమార్ ప్రశ్నించారు. మేయర్ సభను పది నిమిషాలు వాయిదా వేశారు. ఈక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు అందరూ సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి బయటికి వెళ్లిపోయారు. అనంతరం సమావేశం ప్రారంభం చేయాలంటే 19మంది సభ్యులు ఉంటే చేయాలి అయితే 17 మంది సభ్యులు ఉండటంతో మేయర్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సమేశం జరిగింది. రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం,ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, హాజరు అయ్యారు. సమావేశం ప్రారంభం అయిన మధ్యలో టీడీపీ కార్పొరేటర్ క్రాంతికుమార్ చేసి వాఖ్యలకు వైసీపీ కార్పోరేటర్లు నిలదీయడంతో వాగ్వివాదం మొదలైంది.

ఒకరిపై ఒకరు సెటైర్లు..!

టీడీపీ కార్పొరేటర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కాంట్రాక్టర్‌కే 108 పనులు అప్పజెప్పడంతో పాటు సీ.బిల్లుల రూపంలో డబ్బులు మంజూరు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ఎమ్మెల్యేల సహకారంతోనే సి.బిల్లులు రూ.కోట్లలో దోచుకున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలోనే వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు సెటైర్లు వేసుకున్నారు. వైసీపీ కార్పొరేటర్లు అందరూ పోడియం ముందు బైఠాయించి నిరసన తెలపడంతో టీడీపీ కార్పొరేటర్ కలుగజేసుకుని ఫొటోలకు ఫోజులు ఇచ్చింది చాలు.. ఇక వచ్చి కుర్చీలో కూర్చొండని అన్నారు. ఇంతలో వైసీపీ కార్పొరేటర్లు మేము ఫొటోలకు ఫోజులు ఇవ్వడానికి రాలేదని సమాధానం ఇచ్చారు. ఇంతలో పరమేష్ గత ప్రభుత్వంతో కూడ టీడీపీ కార్పొరేటర్లు సమస్య కోసం పోడియం ముందు వెళితే ఇదే మేయర్ ఇక ఫొటోలకు ఫోజులు ఇచ్చింది చాలు వెళ్లి కూర్చోవాలని సమా .దానం ఇచ్చినట్లు గుర్తు చేశారు. సమావేశంలో కమిషనర్ పి.విశ్వ నాథ్, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎవరికీ అన్యాయం జరగదు

మెడికల్ కళాశాల వద్ద రోడ్డు వైండింగ్‌లో వెళ్తున్న దుకాణ యజమానులకు అన్యాయం జరగదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వాటిని కూల్చివేసి రోడ్డు వెడల్పు చేస్తాం. నష్టపోయిన యజమానులకు అశోక్‌నగర్ పంప్‌హౌస్ వద్ద నూతనంగా నిర్మిం చిన దుకాణాలను కేటాయించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. దీనిని రాజకీయం చేయవద్దు. పైప్‌లైన్ మరమ్మతులతో ఐదు రోజులు మాత్రమే తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందని తమ కార్పొరేటర్లు చెప్పారు. 9రోజులు రాలేదని ఎవరూ కూడా చెప్పలేదు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రతన్‌టాటా విగ్రహాన్ని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఏర్పాటుచేస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదు.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శాఖ

రికార్డులు సరిగాలేవు..

మెడికల్ కళాశాల దుకాణాలకు సంబంధించి యజమానులు ఇచ్చిన రికార్డులు సరిగా లేవని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. అది పూర్తిగా ప్రభుత్వ పోరంబోకు అని నిర్ధారణ అయింది. యజమానులకు నష్టపరిహారం కింద ఎలాంటి స్థలం ఇచ్చేందుకు ఆస్కారంలేదు. ఏదైనా ఉంటేవారికి మున్సిపల్ దుకాణాలు కేటాయించేందుకు వీలుంటుంది. పైప్‌లైన్ మరమ్మతులకు గురైనప్పుడు అన్నిప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేశాం.

- పి.విశ్వనాథ్, కమిషనర్, నగరపాలక సంస్థ, కర్నూలు

వార్డులకు నోడల్ అధికారుల నియామకం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో పరిపాలన సౌలభ్యంలో భాగంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, ఆక్రమణల తొలగింపు, సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర పనులు, కార్యక్రమాల పర్యవేక్షణకు నగర పాలక కమిషనర్ ప్రత్యేక అధికారులను నియమించారు. ఒక్కొక్క అధికారికి కొన్ని వార్డులు కేటాయించి, వాటికి నోడల్ అధికారిగా వ్యవహరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి రోజు ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు శానిటేషన్, ప్లానింగ్, అమ్యూనిటీస్ కార్యదర్శులతో కేటాయించిన వార్డులను నోడల్ అధికారులు సందర్శించాలని, సాయంత్రం 5 లోపు ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు పురోగతి నివేదికలను సమర్పించాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు రమణ కుమార్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఐవో కార్యాలయంలో ఆర్ఐవో జి.లాలెప్పను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి సెలవు రోజు ల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. పీడీఎస్‌యూ నాయకుడు అస్లాంబాషా, ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు నవదీప్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి
- 'అన్నదాత సుఖీభవ' చెక్కుల పంపిణీ

గూడూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరులో కోడుమూరు నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దస్తగిరి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో భాగంగా ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడు తూ రైతుల స్థిర ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న


కల్లూరు మండలం పందిపాడులో..

పథకాలపై వివరించారు. ఆర్డీవో సందీప్ కుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రామాంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు దాన మయ్య, డైరెక్టర్ రేమట వెంకటేష్, టీడీపీ నాయకుడు సృజన్, కౌన్సిలర్లు కోడుమూరు షాషావలి, బుడ్డంగలి, టీడీపీ నాయకులు పౌలు, తెలుగు శ్రీను, నాగప్ప యాదవ్, చాంద్‌బాషా, సుమన్‌బాబు, ఏడీఏ సాలురెడ్డి, ఏవోలు దస్తగిరి రెడ్డి, మల్లేష్‌యాదవ్, రవిప్రకాష్, రూఫస్ రేనాల్డ్, శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట: టీడీపీ

కల్లూరు: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ నాయకుడు శేఖర్‌చౌదరి అన్నారు. శనివారం పందిపాడులో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం విడుదల చేసిన చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శేఖర్ చౌదరి మాట్లాడుతూ చంద్రబాబు రాయలసీమ జిల్లాల్లో సాగు, తాగునీటి పథకాలకు నాంది పలికారన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు, కూరపాటి దేవేంద్రరెడ్డి, పూలశివశంకర్, పురుషోత్తం రెడ్డి, భీమ్మడు, లక్ష్మన్న యాదవ్, మద్దిలేటి, బోయశివ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ నిధులు రైతులకు విడుదల కావడంతో గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ప్రతి రైతుకు మొదటి విడత కింద రూ.7వేలు రైతుల ఖాతాలో జమ చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, స్వామిరెడ్డి, రామకోటే శ్వరరావు, వెంకట్రామిరెడ్డి, అల్లాబాబు, పార్థసారధిరెడ్డి, వేణు


రైతులకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, జేసీ నవ్య


ఓర్వకల్లులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

గోపాల్ రెడ్డి, అబ్దుల్లా, శ్రీనివాసులు, శ్రీరాములు, ఆయూబ్ బాషా, స్వాములు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలానికి అన్నదాత సుఖీభవ పథకం కింద గ్రామాల్లోని 10,133 మంది రైతులకు రూ.6.50 లక్షలు వారి బ్యాంక్ ఖాతాలలో జమ అయినట్లు వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ తెలి పారు. శనివారం ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు ఉన్న రైతులకు పం ట నమోదు పూర్తయిన తరువాత డబ్బులు జమ అవుతాయన్నారు.







రసాయన శాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరగాలి

కర్నూలు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజం మరింత అభివృద్ధి చెందాలంటే రసాయన శాస్త్రంలో కొత్త పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో జాతయ రసాయన శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి నాగరాజ్ శెట్టి, ఐక్యూ కోఆర్డినేటర్ డా.విమల రోధే, అధ్యాపకులు బాలరాజు, వెంకన్న, అనూష, బంగారుబాబు, ఎల్లా కృష్ణ, వాహిద్, మహమ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

ఓర్వకల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుం టున్న భూములకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామంలో మైనార్టీలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను రామకృష్ణతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పరిశీలించారు. రామకృష్ణ మాట్లా డుతూ గత 8 సంవత్సరాలుగా కాల్వ గ్రామంలో ప్రభుత్వ భూములను నిరుపేద మైనార్టీలు సాగు చేసుకుంటున్నారని, అయితే గత కొంత కాలంగా భూముల విలువ పెరగడంతో గ్రామంలోని కొందరు అడ్డుకుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాగుదారులు రోఖాబి, హుశేన్‌బీ, మహబూబ్‌బీ, సాహెబ్ మాలిక్, రెహిమాన్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ఓర్వకల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వలన అదనపు కేలరీలు ఖర్చు అవుతాయని, గర్భాధారణ సమయంలో పెరిగిన బరువు తగ్గడానికి సహాయ పడుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారి రాధా మోహన్, స్టాఫ్ నర్సులు సౌజన్య, ఉమారాణి, శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి: సీపీఐ

ఓర్వకల్లు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలను విజ యవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం పిలుపుని చ్చారు. శనివారం ఓర్వకల్లులోని బుగ్గ రామేశ్వర డిగ్రీ కాలేజీలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. జగన్నాథం మాట్లాడుతూ ఈ సభల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి చర్చావేదిక కానుందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రమేష్, మండల సహాయ కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఈదుర్‌బాషా, ఏఐ వైఎఫ్ నాయకుడు వలి, సీపీఐ నాయకుడు రాజు పాల్గొన్నారు.

సీపీఐ బైక్ ర్యాలీ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బైక్‌ర్యాలీ ప్రారంభిం చారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జగన్నాథం మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సి.మహేష్, డి.శ్రీనివాసరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ మీట్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఎస్సీ బాలికల కళాశాలల వసతి గృహం-1 క్రీడాకారులను సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి రాధిక శనివారం అభినందించారు. రాధిక మాట్లాడుతూ సంక్షేమ శాఖకు చెందిన విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం నంద్యాల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతామణి, డిప్యూటీ డైరెక్టర్ రాధికలు క్రీడాకారులను శాలువతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. వార్డెన్ బెన్నమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉన్నారు

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- జొహరాపురంలో 'తొలిఅడుగు'

కర్నూలు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం సాయంత్రం నగరంలోని జొహరాపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఏఏ పథకాలు అందాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లుల అంకౌంట్లలో జమ చేశామని, ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తున్నామని, అర్హులందరికీ ప్రతి నెల 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అమలు చేశామన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ భట్, న్యాయవాదులు పాల్గొన్నారు.



జొహరాపురం, పాలకొట్టాలలో ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజలందరికీ సుపరిపాలన: ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు: రాష్ట్రంలో ప్రజలందరికీ సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. శనివారం 21వ వార్డు పాలకొట్టాల కాలనీలో యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డితో కలిసి ఆమె సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, కట్ట వెం కటరెడ్డి, దివాకరరెడ్డి, వెంకటేష్ చౌదరి, లక్ష్మణ్‌స్వామి, భరత్‌నాయక్, గంగాధర్‌గౌడ్, విష్ణు, మద్దిలేటి పాల్గొన్నారు.జయలక్ష్మి, పి.మౌనిక, శిక్షకుడు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో 'ఆర్ఎస్ అకాడమీ' ప్రతిభ


కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో కర్నూలు ఆర్ఎస్ అకాడమీ అభ్యర్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచారని డైరెక్టర్ రమేష్ శనివారం తెలిపారు. తమ అకాడమీకి చెందిన అభ్యర్థులు జిల్లా స్థాయిలో 3, 5, 6 ర్యాంకులతో పాటు 25 పైగా సివిల్, ఏపీఎస్‌పీ కానిస్టేబుల్స్ పోస్టులకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. మనోజ్ అనే అభ్యర్థి 153 మార్కులతో 3వ ర్యాంకును, రాజ్‌కుమార్ 152 మార్కులతో 5వ ర్యాంకు, రవికుమార్ 151 మార్కులతో 6వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన అభ్యర్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులకు అకాడమీ డైరెక్టర్ రమేష్ అభినందించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం: ఎంపీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరం లాంటిదని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో సి.బెళగల్ మండలం సుంకేసుల గ్రామానికి చెందిన కురువ శ్రీరా ములు ఇటీవల అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఎంపీ నాగరాజును సంప్రదించి బాధితుడు సీఎం సహా య నిధికి దరఖాస్తు చేసుకోగా రూ1,42,744 మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ పేదల సంక్షే మానికి కూటమి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

సి.బెళగల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సైబర్ నేరాల నివారణపై ప్రజలకు ఎస్ఐ పరమేష్ నాయక్ శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లోని వాట్సప్‌లో వచ్చే మేసేజ్‌లను నమ్మి మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మద్యానికి బానిస కాకుండా జాగ్రత్త పడాలన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

ఓర్వకల్లు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కృష్ణయ్య ఆచారి ఇటీవల కాల్వబుగ్గ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలుకు తీవ్ర గాయాలై కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం డిశ్చార్జి అయ్యారు. విషయం తెలుసుకున్న టీడీపీ మం డల కన్వీనర్ గోవిందరెడ్డి గ్రామానికి చేరుకొని కృష్ణయ్య ఆచారిని పరామర్శించారు. నాయకులు రామకోటేశ్వరరావు, రామ మద్దిలేటి, ప్రతాప్ పాల్గొన్నారు.

తైక్వాండోలో కర్నూలుకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ చెన్ను పాటి రామకోట స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో కర్నూలుకు చెందిన 11 మంది క్రీడాకారులు రజిత, కాంస్య పతకాలు సాధించారు. శనివారం శరీన్‌నగర్‌లోని వెంకట్ తైక్వాండో అకాడమిలో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు అభినందించి సత్కరించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వెంకటేశ్‌ను ఆయన అభినందించారు.

పతకాలతో తిరిగి రావాలి

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో జరగబోయే 19వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి కోరారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్ నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే జిల్లా క్రీడాకారులకు వీడ్కోలు ఘనంగా పలికారు. అవినాష్ శెట్టి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఫ్లోర్‌బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





5న 'పాలిటెక్నిక్' స్పాట్ అడ్మిషన్లు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని విరుపాపురం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ నెల 5 స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నపు రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఆగస్టు 4వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకుని, 5న కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఈసీఈ బ్రాంచ్‌లో బీసీ-3, ఈఈఈ బ్రాంచ్-39 సీట్లు ఉన్నాయన్నారు. 8121555646, 9966699093 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి విద్యా వైజ్ఞానిక తరగతులు



పోస్టర్లను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఈనెల 4,5,6 తేదీలలో పీడీఎస్‌యూ విద్యా వైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో పోస్టర్లను విడుదల చేశారు. నంద్యాల పద్మావతి నగర్ నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. రసూల్, కిరణ్, వీరాంజి, సోమేశ్, వంశి, కిరణ్, రాహేల్ పాల్గొన్నారు.

రైతుల కోసం చెరువుల అభివృద్ధి

తుగ్గలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు డీఈ జిలానీ బాషా, గిరిజన సలహా మండలి కౌన్సిల్ సభ్యుడు వెంకటపతి అన్నారు. శనివారం చెన్నంపల్లి చెరువులో చేస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కంప తొలగించి, చుట్టూ రహదారిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో చెరువు లను హంద్రీనీవా నీటితో నింపుతున్నట్లు తెలిపారు. ఏఈ ధర్మేంద్ర, సర్పంచ్ రంగమ్మ, రాజేంద్రగౌడు, రామయ్య, అక్బర్, దేవేంద్ర ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని టీడీపీ నాయకులు గూడూరు ధనుంజయుడు, గడ్డం రామాంజులు, మాజీ సర్పంచ్ లక్ష్మన్న అన్నారు. శనివారం ర్యవైశ్య కళ్యాణ మండపంలో సురక్ష లైఫ్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 'సురక్ష' ప్రతినిధి ప్రశాంతి నాయకులు జంబునాథ్ రాయుడు, సుధాకర్‌చౌదరి శంకర్, చంద్ర, లక్ష్మన్న ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

దేవనకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ నాయకులు మద్దిలేటిశెట్టి, నర్సారావ్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో సీపీఐ 24 జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కొండప్ప, రాజశేఖర్ ఉన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్హులందరికీ పింఛన్లు



మీనాక్షినాయుడిని కలిసిన కొత్త పింఛన్‌దారులు

ఆదోని, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్ ఇస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పేర్కొన్నారు. 1వ వార్డు కౌన్సిలర్ పార్వతీ వెంకటేష్ తమ వార్డు పరిధిలో కొత్త పింఛన్లు మంజూరైన లబ్ధిదారులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందన్నారు. తమ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టిందన్నారు. సచివాలయ సిబ్బంది చిన్నరాజు, యశోద కృష్ణ, టీడీపీ నాయకులు వెంకటేష్, బీటీ బాబు, జయరాం, వెంకట్ పాల్గొన్నారు.

యోగాలో బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవరావు

ఆలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగా అండర్-14 విభాగం పోటీల్లో ఆలూరు మోడల్ స్కూల్ విద్యార్థులు యువరాజు, మహీధర్ బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాఘవరావు, తెలిపారు. శనివారం మాట్లాడుతూ కర్నూలులో జిల్లాస్థాయిలో పోటీల్లో వీరు ప్రతిభ చూపారని, విజయవాడలో ఈనెల 3వ వారంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పీఈటీ ఈరన్న, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్, అధ్యాపకులు ఉన్నారు.

కుల వివక్షపై కేసు నమోదు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఢణాపురం దళిత సర్పంచ్ చంద్రశేఖర్ పట్ల కులవివక్ష చూపిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో కరపత్రాలను విడుదల చేశారు. శ్రీనివాసులు వీరేష్, మోపూరు సూర్య సుజ్ఞానమ్మ ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు
- అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో నగదు జమ
- నియోజకవర్గాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకుల సంబరాలు



పత్తికొండలో రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ఆలూరులో మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

పత్తికొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ మే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగు తోందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం చక్కరాళ్ల గ్రామంలో 'అన్నదాత సుఖీభవ' రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందని అందుకే వారికి అండగా నిలిచామన్నారు. రైతులకు రెండు విడతల్లో రూ.20లు ఇస్తున్నామని, మొదటివిడతగా రూ.7వేలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. నియోజకవర్గ పరిధిలో 54,774 మంది రైతులకు రూ 37.83 కోట్లు జమ చేశామన్నారు. అనంతరం రైతులకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఆర్డీవో భరత్‌నాయక్, ఏడీఏ మోహన్ విజయకుమార్, ఏవో వెంకటరాముడు, ఆర్‌ఐ స్వామి, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ఎంపీటీసీ రాజు, సింగిల్‌విండ్ అధ్యక్షుడు రంగప్ప, నాయకులు, రామానాయుడు, తిమ్మరాజు, డాన్, రాంపల్లి రంగప్ప, బీజేపీ నాయకుడు గోవర్దన్ ఉన్నారు.

అన్నదాత సుఖీభవతో రైతుకు ఆసరా

ఆలూరు: 'అన్నదాత సుఖీభవతో' రైతులు ఆసరా లభించిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని జిలా సహకార బ్యాంకు కేంద్ర ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఏడీఏ చెంగలరాయుడు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఏవో వెంకటేశ్వరగౌడ్, ఏబీసీ డీసీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు, అశోక్, సుధాకర్ ఉన్నారు.

తుగ్గలి: రాష్ట్రంలో రైతులు అభివృద్ధి చెందుతున్నట్లు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి అన్నారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ అమలు చేసినందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు క్షీరాభిషేకం

అన్నారు. ఏఈవోలు లక్ష్మీనారా యణ, బాల సరస్వతి, తిరుపాల్ నాయుడు, చంద్రశేఖర్ యాదవ్, వెంకటస్వామి ఉన్నారు.

ఆలూరు: సీఎం చంద్రబాబు రైతుకు మేలు చేశారని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, కామినహాల్ రమేష్ అన్నారు. రైతులకు అమలు చేయడంతో శనివారం సాయంత్రం పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏబీసీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, కన్వీనర్ అశోక్, సర్పంచ్ నాగరాజు, రఘుప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

హాలహర్వి: మండల కేంద్రంలో భారీ బహిరంగ సభలో ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ మల్లికార్జున, యువనేత రఘుప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు రమేష్, తిప్పేస్వామి, కురువ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు తుగ్గలి నాగేంద్ర



ఆలూరులో వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఆస్పరి: మండలంలో 14,503 మంది రైతులకు రూ.9.9 కోట్లతో ఒక్కో రైతుకు రూ.7 వేలు చొప్పున నగదు ఖాతాల్లో జమ అయ్యింది. సొసైటీ మాజీ ఛైర్మన్ నౌసేపాటిచౌదరి, రవిప్రకాష్‌రెడ్డి సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.ఎంపీటీసీ రహమతుల్లా, మేకల రంగనాథ్, యుగంధర్, వీరేష్ ఉన్నారు.

వెల్దుర్తి: గుంటుపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు ఈదుల వెంకటరాముడు క్షీరాభిషేకం నిర్వహించారు. రాజశేఖర్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, డీటీ గురుస్వామి, మాజీ జడ్పీటీసీ ఐజయ్య, పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్ ఉన్నారు.

● 'అన్నదాత సుఖీభవ'తో రైతుకు రైతులకు రెట్టింపు సంతోషం వచ్చిందని టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు, కన్వీనర్ బలరాంగౌడ్ అన్నారు. శనివారం రామళ్లకోట రైతుసేవా కేంద్రంలో ఏవో అక్బర్‌బాషా ఆధ్వర్యంలో నగదు విడుదలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. వెల్దుర్తి సొసైటీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సత్రం రామకృష్ణుడు, రామకృష్ణాచారి, రామస్వామి, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి టౌన్: రైతులకు అన్నదాత సుఖీభవ మొదటి విడత రూ.7వేలు జమ అయిందని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ ఐజయ్య తెలిపారు. వెల్దుర్తిలో 1,704 మంది రూ.1.20 కోట్ల లబ్ధి పొందారన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, డిటీ గురుస్వామి, ఏవో అక్బర్ బాషా ఉన్నారు.

మద్దికెర: రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందిస్తామని తహసీల్దార్ గుండాల్ నాయక్, ఎంపీడీవో స్వర్ణలత అన్నారు. శనివారం రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ మండలంలో 7వేల మందికి పైగా రైతులకు 'అన్నదాత సుఖీభవ' అందుతుందన్నారు. మరో 600 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోకపోవడం వల్ల అందలేదన్నారు. జమేదార్ రాజన్న యాదవ్, గూడూరు ధనుంజ యుడు, ఏవో రవి, ఎస్.లక్ష్మినారాయణ ఉన్నారు.

పేదల కోసమే రూ.5కే భోజనం : ఎమ్మెల్యే

- పత్తికొండలో అన్నక్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ



అన్నక్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేదల ఆకి తీర్చేందుకే సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్ ద్వారా రూ.5లకే భోజనం అందిస్తున్నారని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గతంలోనే క్యాంటీన్ ఏర్పాటుకు యత్నించామని, స్థలసేకరణ ఆలస్యం కావడం, తర్వాత ప్రభుత్వం మారడంతో కుదరలేదన్నారు. ఆర్డీవో భరత్ నాయక్, ఎంపీడీవో కవిత, ఆర్ఐస్వామి, సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, వెంకటపతి, బత్తినిలోక్‌నాథ్ ఉన్నారు.

తల్లిపాలు శిశువుకు శ్రేయస్కరం

వెల్దుర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు శిశువుకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో లూక్ అన్నారు. శనివారం చెరుకులపాడు గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలం నిర్వహించారు. తల్లిపాల ఉపయోగాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు శిశువుకు తల్లి ముర్రుపాలు తాపించాలన్నారు. శిశువు ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు తల్లిపాలలో పుష్కలంగా లభిస్తాయన్నారు. కార్యదర్శి గురుస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో లూక్

స్లూయిజ్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

దేవనకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుండ్లకొండ వద్ద హంద్రీనీవా కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేయలని సీపీఎం నాయకులు వీరశేఖర్, యూసుఫ్, అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడు తూ ప్రధాన కాలువ పూర్తిచేసి పదేళ్ల గడుస్తున్నా, జిల్లాలో 80వేల ఎకరాలకు నీరందడం లేదన్నారు. పెండింగ్ పనులుకు రూ.210 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నర్సింగ్ చేస్తే జర్మనీలో ఉద్యోగాలు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కోర్సులు పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో ఉద్యోగాలు వస్తాయని ఇందుకు ఆ భాషలో శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సిద్ధప్ప, నాగముద్దయ్య తెలిపారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రులు, నోబుల్ వొకేషనల్ జూనియర్ కళాశాల, పద్మావతి వొకేషనల్ జూనియర్ కళాశాల ఆర్ఎస్ నర్సింగ్ కళాశాల చదువుతున్న నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీడీ రాధిక, ఏడబ్ల్యువో బాబు ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. 35 ఏళ్ల కన్నా తక్కువగా ఉన్న బీఎస్సీ నర్సింగ్ చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగిన వారు జీఎన్ఎమ్ కోర్సు చేసి మూడెళ్ల క్లినికల్ అనుభవం కలిగినవారు ఉద్యోగాలకు అర్హులన్నారు. అర్హతగలవారు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న వార్డెన్లు

అన్నదానం గొప్పది

తుగ్గలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదానం గొప్పదని, భక్తుల దాహార్తి తీర్చేందుకు తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసినట్లు ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి అన్నారు. శనివారం చెన్నంపల్లిలో రాముల దేవాలయంలో భక్తుడు పార్వతయ్యశెట్టి, టీడీపీ నాయకులు రాజేంద్రగౌడ్ అన్నదానం చేశారు.

12న సమావేశం

వెల్దుర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ తెలిపారు. శనివారం మాట్లాడుతూ మూడు నెలల అభివృద్ధి పనులు, ఇకముందే చేసే పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. మండల అధికారులు నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

సీపీఐ మహా సభలు

మద్దికెర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9, 10, 11 తేదీల్లో కర్నూలు నగరంలో సీపీఐ 24వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కార్యదర్శి నబీరసూల్ అన్నారు. గురువారం పోస్టర్లను విడుదల చేశారు. బ్యాంకుల జాతీయకరణ, భూ సంరక్షణ చట్టం అమలు కోసం సీపీఐ పోరాటం చేసిందన్నారు. నాగరాజు, హనుమన్న, కోదండరాముడు, సుధాకర్ ఉన్నారు.

క్రీడలు ముఖ్యమే

మద్దికెర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు, క్రీడలు రెండూ ముఖ్యమేనని ఎంఈవో రంగస్వామి, ఫ్రెండ్స్ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎరవలి రామాంజులు అన్నారు. శనివారం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు. ఉపాధ్యాయులు రమేష్, పీఈటీ మహ్మద్ రఫీ తదితరుల ఉన్నారు.

ప్రమాదంలో ఆవు మృతి

ఆదోని టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి కొనడంతో శనివారం ఆవు మృతి చెందింది. యజమానులు ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులే ఆవును తరలించి, పూడ్చిపెట్టారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా సందీప్ మాట్లాడుతూ ఆవులను యజమానులు తమ ఇంటి వద్దే ఉంచుకోవాలని రోడ్లపై వదలకూదని పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోవడం లేదన్నారు. 5వ తేదీ నుండి బహిరంగంగా తిరిగే ఆవులను పోలీసుల సమక్షంలో స్వాధీనం చేసుకొని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

పూడిక తొలగింపు

ఆదోని టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్ద కాలువలో పూడిక తొలగింపును శనివారం ప్రారంభించారు. వర్షాలు రాకముందు చేపట్టాల్సిన పనులను ఆలస్యంగా ప్రారంభించడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ పనులను రూ.20లక్షలతో చేపట్టినట్లు మునిసిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' వరం

దేవనకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ రైతులకు వరమని వాల్మీకి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొజ్జమ్మ అన్నారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నిర్వహించిన ప్రత్యక్షప్రసారాన్ని వీక్షించారు. మండలంలో 15206 మంది రైతులకు రూ.10.06 కోట్లు విడుదలైనట్లు ఏవో ఉషారాణి తెలిపారు. టీడీపీ కన్వీనర్ విజయబాస్కర్‌గౌడ్ ఉన్నారు.

నేను రాకుండా ఎలా ప్రారంభించారు?

- 'అన్నదాత సుఖీభవ' సభను అడ్డుకున్న బీజేపీ నాయకుడు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ నాయకుడు

ఆదోని రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగనాథనహళ్ళి గ్రామంలో తను రాకముందే సమావేశాన్ని ఎలా ప్రారంభిస్తారని బీజేపీ నాయకుడు, ఎమ్మెల్యే అనుచరుడు నాగరాజు గౌడ్ అడ్డుకున్నారు ఉదయం 10.30 గం.లకు ప్రాంభమైన సభకు మధ్యాహ్నం 12.30గం.ల కు వచ్చి మధ్యలో బైఠాయిం చారు. అధికారులతో వాగ్వాదా నికి దిగారు. తాము లేకుండా ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● అన్నదాత సుఖీభవ అమలు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టాలని రైతులు ఈరన్న, నాగరాజు, శాంతమ్మ, పార్వతమ్మ ఆకాంక్షించారు. ఏడీఏ బాలవర్ధిరాజు, ఏవో సుధాకర్ ముఖ్య అతిథి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు, పీఎం మోదీ, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

అన్నదాత సంక్షేమానికి కృషి చేయాలి



ఛైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

మద్దికెర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సంక్షేమానికి కృషి చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు అన్నారు. శనివారం సహకార సంఘం ఛైర్‌పర్సన్ ఆనంద్‌ను సన్మానించారు. మద్దికెర సింగిల్ విండో జిల్లాలోనే రెండో స్థానంలో ఉందన్నారు. సకా లంలో రుణాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే శ్యాంబాబు నేతృత్వంలో బీసీలకు పదవులు వచ్చాయనీ గుర్తు చేశారు. పారా విఠోబ, మీసేవ భీమరాజు, గొడుగు సతీష్ కుమార్ ఉన్నారు.

సమయానికి భోజనం పెట్టాలి

ఆదోని టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): క్యాంటీన్‌కు వచ్చేవారికి సమయానికి భోజనం పెట్టాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని పాత ఫైఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. భోజనం రుచి, శుచి వివనాలపే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమయానికి ప్రజలకు భోజనం అందించాలని, వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణ

తల్లిపాల వారోత్సవాలు

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లుగుండు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సరస్వతి మాట్లాడుతూ పుట్టినవెంటనే ముర్రుపాలు తాపాలన్నారు. పిల్లలకు ఐదు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. పుట్టిన వెంటనే ఆధార్ నమోదు చేయాలని, రేషన్ కార్డుకు దరఖాస్తు చేయాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు రాజేశ్వరి, నాగమణి, షమీనాబి, రేణుక, బాలింతలు, గర్బవతులు, పిల్లలు పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్

పీహెచ్‌సీలో వైద్యులు లేరు!

- నిరాశతో వెనుదిరిగిన రోగులు



వెనుదిరుగుతున్న వృద్ధురాలు గౌరమ్మ

హాలహర్వి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. శనివారం ఆరోగ్య కేంద్రాన్ని వచ్చిన రోగులకు వైద్యులు, సిబ్బంది కనిపించలేదు. దీంతో వారు నిరాశగా వెనుదిరిగారు. హాలహర్వికి చెందిన గౌరమ్మ తాను కాళ్లు, నడుము నొప్పులతో బాధపడుతున్నాని, తీరా ఇక్కడ వైద్యులు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వైద్యాధికారి మన్సూర్ వలిని వివరణ కోరగా ఒక వైద్యుడు తిమ్మన్న 104లో విధులకు హాజరయ్యారని, తాను వ్యక్తిగత పనుల కారణంగా రాలేదన్నారు.

పంచాయతీ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్

● బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పైసలు లేవు ● నిలిచిపోయిన అభివృద్ధి పనులు ● లోపించిన పారిశుధ్యం



వి.అగ్రహారంలో డ్రైనేజీ లేని ఎస్సీ కాలనీ



సర్పంచ్‌లు సొంత డబ్బుతో వీధి దీపాలు వేయిస్తున్న దృశ్యం



సర్పంచ్ సొంత ఖర్చుతో తాగునీటి బోర్‌కు మరమ్మతు చేయిస్తున్న దృశ్యం

గోనెగండ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఖాతాలు ఖాళీగా మిగిలిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. ఈ కారణంగా గ్రామాలలో అభివృద్ధి పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి. కనీసం పారిశుధ్య పనులను కూడా పూర్తిగా చేయని స్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం అంటువ్యాధులు ప్రబలే సీజన్ కావడంతో మురికి ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లేందుకు నిధులు లేవు. తాగునీటి సమస్య, విద్యుత్ బల్బులు, పంచాయతీ కార్మికుల వేతనాలు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీ పనుల కోసం ఇతర వస్తువులను కొనేందుకు కూడా నిధులు లేవు. గ్రామ పంచాయతీ ఖాతాలలో నిధులు లేవని జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలుపుతున్నారు. ఇక ఎక్కడి నుంచి గ్రామ సమస్యలు తీర్చాలి అంటూ సర్పంచ్‌లు అంటున్నారు. గోనెగండ్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఒకటి మేజర్ పంచాయతీ మిగిలిన 19 మైనర్ పంచాయతీలు, మైనర్ పంచాయతీలలో బ్యాంక్ ఖాతాలో సున్నా నిల్వలు ఉండటంతో ఏవిధంగా పనులు చేయాలని గ్రామ సర్పంచ్‌లు ఆవేదన చెందుతున్నారు. కొన్ని గ్రామాలలోని సర్పంచ్‌లు అప్పులు చేసి పనులు చేపట్టారు నిధులు వస్తాయని. అయితే 10 నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో గ్రామ సర్పంచ్‌లు చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక అవస్థలు పడుతున్నారు.

సొంత డబ్బులతో ఎన్నో రోజులు: పంచాయతీ ఖాతాలో నిధులు లేక పోవడంతో గ్రామంలోని కొన్ని అత్యవసరమైన పనులు గ్రామ సర్పంచ్‌లే సొంత డబ్బు ఖర్చు చేసి పనులు చేయిస్తున్నారు. ఇలా ఎన్ని రోజులు సొంత డబ్బులు పెట్టి పనులు చేపడతామని వారు ఆవేదన చెందుతున్నారు. నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో తెలీదు. గ్రామ పనులకోసం చేసిన అప్పులకు వడ్డీ రూపంలో అధికంగా చెల్లించాల్సి వస్తుందని గ్రామ సర్పంచ్‌లు అంటున్నారు. దాదాపు మూడేళ్లు గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాలేదు. విడుదల అయిన మొత్తాన్ని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పెద్దల పక్కదారి మళ్లించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొంత వెసులుబాటు వచ్చింది. ప్రస్తుతం నిధులు విడుదల చేయకపోతే గ్రామ సచివాలయాలు కూడా పనులు చేయడం మానేసే సమస్య ఉందని సర్పంచ్‌లు ఖరాకండిగా చెప్తున్నారు.

రూ.4కోట్ల విద్యుత్ బిల్లు పెండింగ్: గోనెగండ్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బిల్లు దాదాపు రూ. 4కోట్ల వరకూ పెండింగ్ ఉన్నట్లు విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు. ఏదో ఏడాదికి ఒక సారి కొంత డబ్బు చెల్లిస్తున్నారని గ్రామాల విద్యుత్ బిల్లు మాత్రం ఎప్పటి కప్పుడు పెరిగిపోతూనే ఉంటుందని సర్పంచ్‌లు ఆవేదన చెందుతున్నారు.

10 నెలలుగా నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు: గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నాలుగు నెలలకు ఒక సారి వ్యక్తికి నాలుగు రూపాయల చొప్పున జనాభా లెక్కల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు విడుదల అవుతాయి. అయితే గత ఏడాది 2024 సెప్టెంబర్ లో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. దాదాపు 10 నెలలు కావస్తోంది. దీంతో గ్రామాలలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

నిలిచిపోయిన పనులు: వర్షాకాలం సీజన్ కావడంతో వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గ్రామాలలో బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు పిచికారి చేయడం, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేసే కార్మికులకు 10 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం తో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. నిధులు విడుదల అయితే తప్ప గ్రామాలలో నిలిచిన పనులు ప్రారంభం అయ్యే విధంగా లేవు.

నిధులు విడుదల చేయాలి



గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం కూడా మా సర్పంచ్‌లతో ఆడుకుంటున్నారు. ఎప్పుడు నిధులు విడుదల చేస్తారో కూడా తెలియదు. కాని గ్రామాలలో మాత్రం మేము పనులు చేయాల్సిందే. లేక పోతే గ్రామ ప్రజ లు ఇబ్బందిపడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి.

రంగారెడ్డి, సర్పంచ్, వి.అగ్రహారం

ఇబ్బందిగా ఉంది



గ్రామాలలో పారిశుధ్య పనులకు కూడా ఇబ్బంది గా ఉంది. బ్లీచింగ్ పౌడర్ కొనేందుకు కూడా నిధులు లేవు. తాగునీటి పైప్‌లైన్, మోటార్ మర్మతులు, వీధి దీపాలు ఏర్పాటు సొంత ఖర్చులు పెట్టలేక పోతున్నాము. పంచాయతీ కార్మికులు జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

లింగమ్మ, సర్పంచ్, గంజహళ్లి

నిధులు విడుదల కావచ్చు

గత ఏడాది సెప్టెంబర్ నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. ఈ విషయంను డీపీవో దృష్టికి తీసుకువ చ్చాము. మరో 20 రోజులలో నిధులు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాలలో పనులు సర్పంచ్‌లు స్వంతడబ్బుతోనే పనులు చేయిస్తున్నారు.

- అనంతశయన, డిప్యూటీ ఎంపీడీవో, గోనెగండ్ల

పాఠశాల తనిఖీ



వసతి గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి ఫారంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంతో పాటు గురుకుల పాఠశాల, కళాశాలలను కలెక్టర్ రంజిత్ బాషా శనివారం తనఖీ చేశారు. ముందుగా జవహర్ నవోదయ విద్యాలయాన్ని పరిశీలించి అక్కడ నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గురుకుల కళాశాలలో నిర్మిస్తున్న వసతి గృహాలను పరిశీలించి విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం లేకుండ త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి, గురుకుల కళాశాల విద్యాలయం ప్రిన్సిపాల్ సౌజన్యలత, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యంతో మాట్లాడారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్, తహసీల్దార్ శేషఫణి, ప్రభు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు

కలెక్టర్‌కు వినతులు : మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నదాతా సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు విద్యార్థి సంఘాల నాయకులు, రైతుల నుంచి వినతులు వచ్చాయి. ఎమ్మిగనూరు పట్టణంలోని బాలికలకు నూతన వసతి గృహాన్ని నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, యు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఉదయ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు శేఖర్ లు వినతిపత్రం అందజేశారు.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించం



ప్రజలతో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కోటేకల్లు, దేవిబెట్ట గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, ఇబ్బందులు సృష్టించేందుకు ప్రయత్నించినా తమకు సమాచారం అందజేయాలన్నారు. ప్రస్తుతం పంటల సమయం కావునా రైతులు ఏ వైనా భూ సమస్యలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలేగాని, మర్డలకు పాల్పడరాదన్నారు. గ్రామాల్లో ఉన్న యువత గ్రామాభివృద్ధికి సహకరించుకోవాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల జూనియర్ కళాశాలలో గణిత గెస్టు ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి కోరారు. ఎమ్మెస్సీ గణితంలో 50 శాతం మార్కులు కలిగినవారు అర్హులని తెలిపారు. కావునా ఆసక్తి గల వారు ఈ నెల 4వ తేదీలోపు కళాశాలలో అందజేయాలని కోరారు. 5వ తేదీ ఉదయం డెమో క్లాస్ ఉంటుందని అదే రోజు ఎంపిక జరుగుతుందని మరునటి రోజు తెలియజేస్తామని తెలిపారు.

జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక నిలువ దోపిడీ చేసే విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు కోసం ఈ నెల 5న తేదీన విద్యుత్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, సీఐటీయూ అధ్యక్షులు గోవిందు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాముడు, హనుమంతు, అబ్దుల్లా, ఆసీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

కౌతాళం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలు పరిష్కరించ డానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కౌతాళం సొసైటీ ఛైర్మన్ వెంకటపతిరాజు అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని సొసైటీ కార్యాలయంలో శనివారం రైతులకు కేంద్ర ప్రభుత్వం అం దిస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ యోజన, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన నగదు బదిలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, సొసైటీ సభ్యులు వీరేష్, నబీసాబ్, విశాల సహకార పరపతి సంఘం బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం ప్రాంగణం

మంత్రాలయం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శ్రావణమాస శుద్ధ శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు



వందగల్లులో గర్భిణులు, బాలింతలను విచారిస్తున్న సీడీపీవో

కోసిగి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో అంగన్‌వాడీ సెంటర్ల సమయపాలన ఏదీ..? అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం ఇవ్వరూ.. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ కరువు అనే ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి శనివారం ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు కాత్యాయనీ, భాగ్యలక్ష్మి వందగల్లు గ్రామానికి పరుగులు పెట్టారు. గ్రామంలోని ఈశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలతో సీడీపీవో రాజేశ్వరి విచారణ జరిపారు. గ్రామస్థులు అంగన్‌వాడీ సెంటర్లు సమయ పాలన పాటించడం లేదని, సక్రమంగా పౌష్టికాహారం అందించడం లేదని అంగన్‌వాడీ సెంటర్లకు బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని విచారణలో తేలడంతో వందగల్లు గ్రామంలో ఉన్న మూడు అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లయిన లక్ష్మీదేవి, హరిత, మల్లమ్మలకు మెమోలు జారీ చేస్తున్నట్లు సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు లూసమ్మ, వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, హరిత, మల్లమ్మ, గ్రామస్థులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దకడబూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో వెలసిన పైరయ్య ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. భక్తులకు శ్రీనాథ్ అనే భక్తుడు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఎంపీటీసీలకు జీతాలు ఇవ్వండి

మంత్రాలయం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం సర్వసభ్య సమావేశం 45 నిమిషాల్లో తూతూ మంత్రంగా ముగించేశారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు వచ్చారా.. సంతకాలు చేశారా.. అధికారులు మాట్లాడారు.. వెంటనే వెళ్లిపోయారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గిరిజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో నూర్జహాన్ నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ గోవిందమ్మ, వ్యవసాయ సలహా మండలి మాజీ ఛైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ రామచంద్ర, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, బెస్త అంజనయ్య, ఎంపీటీసీలు వెంకటేశ్ శెట్టి, కురువ ఈరన్న, మజ్జిగ నరసమ్మ, ఏఈలు వెంకట్రాముడు, మల్లయ్య పీఏపీ భద్ర వాళ్ళప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మంత్రాలయం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన గుంటుపోగుల పెద్ద బజారి (80) మోటారు సైకిల్ ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. నందవరం చెందిన వ్యక్తి మంత్రాలయం నుంచి సొంతూరు వెళ్తుండగా.. చిలకలడోన రోడ్డు పక్కన ఉన్న గుంటుపోగుల పెద్ద బజారిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఆసుపత్రిలో కోలుకోలేక శనివారం ఉదయం మృతి చెందాడు. కొడుకు రామన్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులను తప్ప ఇతరులను అనుమతించరాదని ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వీరేశ్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రజాస్వామ్య హక్కులను హరించేదిగా ఉందన్నారు. జీవోను రద్దుచేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నవీన్ కుమార్, రంగస్వామి, సోమిరెడ్డి, అజయ్ బాబు, భాస్కర్, సాయి హర్షలు పాల్గొన్నారు.

అన్నదాతల్లో సంతోషాన్ని చూడడమే లక్ష్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ● జగన్ జైలుకెళ్లడం తథ్యం.. వైసీపీ ఇక భూస్థాపితమే: సోమిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

మంత్రాలయం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతుల మోముల్లో సంతోషాన్ని చూడడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మంత్రాలయం పాత జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అన్నదాత సుఖీభవ పథకం విడుదల శుభసందర్భంగా నాలుగు మండలాల నాయకులు, అధికారుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు కు చెందిన 41,992 మంది రైతులకు రూ.27.96 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా వచ్చిన కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డికి వ్యవసాయాధికారులు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు.

జగన్ జైలుకెళ్లడం ఖాయం

ఐదేళ్ల దుర్మార్గపు పాలన చేసిన జగన్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయమని ఆయన పెట్టిన పార్టీ భూస్థాపితం కావడం ఖాయమేనని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మద్యం ఇసుక అక్రమాలతో జగన్‌కు పిచ్చి పట్టిందని, తిరుపతి పిచ్చాసుపత్రికి వెళ్లక తప్పదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని జీర్ణించుకోలేక టీడీపీపై అబాండాలు వేసే యత్నం చేయడం దుర్మార్గమన్నారు. జగన్ మాయమాటలు చెబితే వినే ప్రజలు లేరని, 11 సీట్లతో ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పారని అన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీలక్ష్మన్న, రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు దూదేకుల సలాం గౌరవార్యక్షులు సాయిబాబా, నరవ రమాకాంత్ రెడ్డి, మంచాల, కల్లుదేవకుంట సొసైటీ ఛైర్మన్లు రామకృష్ణారెడ్డి, రాగమ్మ, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మంత్రాలయం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ల పరిశీలన

గోనెగండ్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి మల్లెల వంక వాగులో ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యామ్‌లను జిల్లా మైనర్ ఇరిగేషన్ ఏఈ రంగస్వామి శనివారం పరిశీలించారు. ఈ నెల 29వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'చెక్ డ్యామ్‌లకు రక్షణ కల్పించండి' అనే కథనానికి మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గంజహళ్లి మల్లెల వంక వాగులో నిర్మించిన చెక్ డ్యామ్‌లను ఆయన పరిశీలించారు. అక్కడ చేరుకున్న రైతులతో ఆయన మాట్లాడారు. విషయం అడిగి సమాచారం రాబట్టారు. ఆయన మాట్లాడుతూ చెక్ డ్యామ్‌లను ఎవరూ కూల్చకూడదని అలా కూల్చిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం హామీతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

మంత్రాలయం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ గిరిజమ్మ కోరారు. శనివారం బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు అపరిశుభ్రతపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాల్సింది ప్రభుత్వమేనని, ఇంత నిర్లక్ష్యం చేయడం దారుణమని అన్నారు. హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించాలని వార్డెన్‌కు సూచించారు. ఈ పరిశీలనలో జడ్పీటీసీ గోవిందమ్మ, సీవీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, బెస్త అంజిని, వైస్ ఎంపీపీ రామచంద్ర, పాల్గొన్నారు.

ఉరుకుంద విద్యార్థి ప్రతిభ

కౌతాళం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఉరుకుంద గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి నాగరాజు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి దిద్ది నాగరాజు ఇటీవల కర్నూలులో జరిగిన అథ్లెటిక్స్‌లో 600మీటర్ల పరుగు పందెం విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. పరుగు పందెంలో ప్రతిభ చాటినందుకు మెడల్‌తో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. ప్రతిభతో తమ పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థి నాగరాజును ఉపాధ్యాయులు సన్మానించారు.

'హామీలను విస్మరించిన ప్రభుత్వం'

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, సహాయ కార్యదర్శి నాగలక్ష్మి తెలిపారు. పోషణ ట్రాకర్ బాల సంజీవిని యాప్‌లను సోమవారం నుంచి బంద్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవిందు, రాముడు పాల్గొన్నారు.

చీకట్లో సజ్జలగుడ్డం ఎస్సీ కాలనీ

కోసిగి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలోని ఎస్సీ కాలనీ నెల రోజులుగా చీకటిలో మగ్గుతుంది. నెల రోజుల నుంచి ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేక చీకటిలో మహిళలు, వృద్ధులు, పిల్లలు బయటకు రాలేకపోతున్నారని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విష పురుగులు, పాములు ఇంట్లోకి వస్తున్నాయని, భయం భయంతో గడుపుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చీకటిలో ఉన్న ఎస్సీ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షం కోసం పాదయాత్ర



తుంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్థులు

మంత్రాలయం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వరుణదేవుడు కరుణించకపోవడంతో వానలు ఎండిపోవడం చూస్తున్న రైతన్నలు మంత్రాలయానికి పాదయాత్రగా వచ్చి తుంగాజలంతో గ్రామ దేవతలకు అభిషేకించేస్తే వర్షం కురుస్తుందని విశేష నమ్మకం. శనివారం మంత్రాలయం మండలంలోని చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామాలకు చెందిన దాదాపు 1000 మంది రైతులు వేర్వేరు సమయాల్లో గ్రామాలనుంచి పాదయాత్రతో మంత్రాలయానికి చేరుకున్నారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి వెంటతెచ్చుకున్న బిందెలు, చెంబులతో తుంగా జలాన్ని తీసుకుని మంగళవాయిద్యాలు రాఘవేంద్రస్వామి పూజలు చేసి కట్టెలు, ఆయుధాలు, భజనమండలులు, తప్పెట్లు, బీరప్పడోళ్ల పాదయాత్రతో గ్రామాలకు చేరుకున్నారు.

విరాళాలు అందజేత

కౌతాళం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారికి భక్తులు శనివారం వివిధ పనులకు విరాళాలను అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ విజయరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయంలో భక్తులకు అందిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి కర్నూలు జిల్లా తుగ్గలి మండలానికి చెందిన రమనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50వేల నగదును, ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు అనంతపురం పట్టణానికి చెందిన రాజేష్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.59వేల నగదును అందజేసినట్లు తెలిపారు. దాతలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి లడ్డు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు స్వామి ఉన్నారు.